సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 14-11-2024
సంపుటి: 20 సంచిక: 196
పేజీలు: 4 వెల: రూ.1

## 22 నుంచి సూర్యదర్శనం ప్రవచన యజ్ఞం


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షన్ముఖశర్మ ఆధ్వర్యంలో సూర్యదర్శనం అంశంపై ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉపనిషన్మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్, శ్రీ సుమిత్ర కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర్ శర్మ ఒక ప్రకటనలో కోరారు. స్థానిక బాపూజీ కళామందిరంలో ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటలు వరకు జరిపే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

1950లో ఏర్పాటై 1954లో ఉపనిషన్మందిరంగా ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో 5/54 నెంబరుతో గుర్తింపు పొంది నాటి నుంచి ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్ష, సాహిత్య, సంగీత, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తున్న ఏకైక సంస్థ ఉపనిషన్మందిరం. ప్రజల్లో ఆధ్యాత్మిక భావన కలిగించడమే సాహితీ ప్రసంగాలను ఏర్పాటుచేసి సాహిత్యాభిలాష పెంపుదలకు కృషి చేస్తోంది. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే దిశలో కళాశాలలు, పాఠశాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎందరో సాహితీ ఉద్దండులను ఆహ్వానించి ప్రజల్లో సాహిత్యాభిలాష కలిగిస్తోంది. ఆధ్యాత్మిక, సాహితీ వికాసానికి పాటుపడుతున్న సహస్రావధాని గరికిపాటి నరసింహారావు, చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖశర్మ వంటి పండితులను శ్రీకాకుళానికి పరిచయం చేసి సాహితీ ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతున్న సంస్థ ఉపనిషన్మందిరం.



- తడిసి మోపెడవుడవుతున్న టాక్స్‌లు
- 20 శాతం లాభం కాస్త 9కి మిగిలింది
- ఏడాదిలో కట్టాల్సిన లైసెన్స్ ఫీజు 8 నెలలకు కుదించుకుపోయింది
- రూ.10 లక్షలు అమ్మితే 90వేలు లాభం
- రెండు నెలల లాభం లైసెన్స్ ఇన్‌స్టాల్‌మెంట్‌కు సరి




# లాభం గూబల్లోకొస్తుంది..!

**అన్ని పన్నులు సరలీకరించడం ద్వారా మద్యం వ్యాపారులకు గరిష్టంగా 20 శాతం మార్జిన్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ద్వారా పెద్ద మొత్తంలో దరఖాస్తులు వేసి జిల్లా నుంచి కేవలం అప్లికేషన్ ఫీజు రూపంలోనే రూ.92 కోట్లు ఇచ్చిన వ్యాపారులు ఇప్పుడు అన్ని లెక్కలూ చూసుకుంటే 9 శాతానికి మించి లాభం రావడంలేదని లబోదిబోమంటున్నారు. మూలిగిన నక్క మీద తాటిపండు పడినట్లు రెండు నెలలకు ఒకసారి కట్టాల్సిన లైసెన్స్ ఫీజు ఇన్‌స్టాల్‌మెంట్ సమయాన్ని కుదించడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కులు చూస్తున్నారు.**

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

### ఫీజు చెల్లింపులో మెలిక

లైసెన్స్ ఫీజు చెల్లింపు విషయంలోనూ ప్రభుత్వం మెలికపెట్టింది. మద్యం దుకాణాన్ని లాటరీలో దక్కించుకున్న మరుక్షణమే ఏడాదికి రూ.65 లక్షలు లైసెన్స్ ఫీజులో ఆరో వంతు అంటే సుమారు 11 లక్షలు చెల్లించారు. మిగతా మొత్తానికి బ్యాంకు గ్యారెంటీలు సమర్పించారు. ఏడాదికి చెల్లించాల్సిన మిగతా మొత్తం ప్రతి రెండు నెలలకు ఒకసారి 10 నెలల్లోగా చెల్లించాలి. ఇప్పుడు గజిట్‌లో పేర్కొన్న దానికి భిన్నంగా లైసెన్స్ ఫీజును వసూలు చేయడం ప్రారంభించింది. డిసెంబర్ 20 నాటికి చెల్లించాల్సిన రెండో ఇన్‌స్టాల్‌మెంట్‌ను ఈ నెల 20కే చెల్లించాలని లైసెన్స్‌దారులకు నోటీసులు జారీ చేసింది. రెండు నెలల్లో చెల్లించాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్‌ను నెల రోజులకు కుదించింది. అంటే ఏడాది లైసెన్స్ ఫీజును ఎనిమిది నెలల్లోనే వసూలు చేస్తుందన్నమాట. దీనికి తోడు సకాలంలో ఫీజు చెల్లించకుంటే గడువు దాటిన తర్వాత మొదటి 10 రోజులకు 10 శాతం, 11వ రోజు నుంచి 20 శాతం, 21వ రోజు దాటితే 30 శాతం వడ్డీతో చెల్లించాలని షరతు విధించింది. ఒకవేళ చెల్లించకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో మద్యం వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు.

### పన్నుల రూపంలో

మద్యం తయారుచేసే కంపెనీ దగ్గర్నుంచి, రాష్ట్రానికి సరుకు వచ్చేవరకు వివిధ దశల్లో అనేక టాక్స్‌లు విధించిన తర్వాత నిర్ణయించిన ఎమ్మార్పీపై 20 శాతం లాభం వస్తుందని గెజిట్ చూసిన వ్యాపారులకు అర్థమయింది. తెలంగాణలో ఇదే మోడల్ ఉండటంతో 20 శాతం కాకపోయినా కనీసం 13 శాతమైనా మిగులుతుందని ఈ రంగంలో ఆరితేరినవారు భావించారు. కానీ ప్రభుత్వం బిగించిన అనేక మెలికల వల్ల ఇప్పుడు 9 శాతానికి లాభం కుదించుకుపోయింది.

### కోత విధించి మద్యం రిలీజ్

ప్రభుత్వం ప్రస్తుతం వ్యాపారులు మద్యం కోసం చెల్లిస్తున్న నెట్ ఇండెంట్ మొత్తంలో 42.28 శాతం పన్నుల రూపంలో కోత విధించి కేవలం 57.72 శాతానికి మాత్రమే మద్యం రిలీజ్ చేస్తుంది. ఇందులో సెస్సులు, ప్రివిలేజ్ ఫీజులు అని అనేక రకాల మెలికలు ఉన్నాయి. ఉదాహరణకు రూ.10 లక్షల సరుకు కావాలని ఇండెంట్ పెడితే, అందులో రూ.4,22,800 టాక్స్ కింద కట్ చేసి మిగతా రూ.5,77,200కు మద్యం రిలీజ్ చేస్తున్నారు. రిలీజ్ అయిన మద్యం విక్రయిస్తే రూ.90వేలు మిగులుతుంది. ఈ లెక్కన రోజుకు రూ.2 లక్షలు విక్రయించే షాపులకు రోజుకు రూ.18 వేలు లాభం వస్తుందని, నెలకు సుమారు రూ.6 లక్షలు చెప్పున రెండు నెలలకు రూ.12 లక్షలు వస్తుందని చెబుతున్నారు. రెండు నెలల్లో వచ్చే రూ.12 లక్షలను ప్రతి రెండు నెలలకు చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజుకే సరిపోతుందని చెబుతున్నారు. షాపు నిర్వహణ, మద్యం డిపో నుంచి రవాణా, షాపులో పనిచేసే సిబ్బంది జీతాలు, మద్యం స్టాక్ కోసం తెచ్చిన అప్పునకు వడ్డీ జేబులో నుంచే చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమౌతోందని, వీటికి అదనంగా ఎక్సైజ్ అధికారుల ప్రోటోకాల్స్‌ను చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. మొదటి ఏడాదికి రూ.65 లక్షలు ఉన్న లైసెన్స్ ఫీజే రెండో ఏడాదికి రూ.71.50 లక్షలు కానుందని, ప్రభుత్వం గజిట్‌లో పేర్కొన్న మాదిరిగా 20 శాతం మార్జిన్ ఇస్తే కొంత వెసులుబాటు కలుగుతుందని చెబుతున్నారు. అమ్మకాలపై 20 శాతం మార్జిన్ అనుకుంటే చేతికి 9 శాతమే వస్తోందని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ వైన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు ఎక్సైజ్ అధికారులను కలిసి మొరపెట్టుకున్నారు. ఇలాగైతే వ్యాపారం చేయడం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వ్యాయామంతో డయాబెటిస్ నియంత్రణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డయాబెటిస్ ప్రాణాంతకం కాదని, ప్రతీ రోజూ వ్యాయామం చేయడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రణలో ఉంచవచ్చని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడి ప్రసాదరావు అన్నారు. రైతుబజారు జంక్షన్‌లో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ గతంలో 50 ఏళ్లు దాటిన వారికి డయాబెటిస్ సంక్రమించేదని, నేడు చిన్నారుల్లో సైతం ఈ వ్యాధి కన్పించడం విచారకరమన్నారు. సరైన ఆహార నియమాలు పాటిస్తూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. శిబిరంలో 300 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్, అధ్యక్షుడు లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, చింతాడ కృష్ణమోహన్, కరణం శోభారాణి, డాక్టర్ మెడిశెట్టి సత్యస్వరూప్, మణిశర్మ, తర్లాడ అప్పల నాయుడు, మజ్జి సుమన్, లక్ష్మణ్, నాయుడు, జేఎన్‌టీ నాయుడు, శాసపు జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్, న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, గుప్త, రవిశంకర్, దేవీప్రసాద్, ఇలిసిపురం మెగా యూత్ సభ్యులు అప్పి, వాసు, హారిక సిబ్బంది పాల్గొన్నారు.

## శర్వాణి వనభోజన మహోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శర్వాణి విద్యాసంస్థల అధినేత అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం, కార్తీకమాస వనభోజన మహోత్సవం ధర్మవరంలో నిర్వహించారు. కార్తీకమాస ప్రాశస్త్యాన్ని తెలియజేసే శివాలయ సందర్శన, కార్తీక దామోదరుని పూజ నిర్వహించారు. అనంతరం శర్వాణి విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో సమష్టి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలు ఏర్పడి ఎవరికివారే యమునాతీరే అన్నట్లు ప్రవర్తిస్తున్నారని, ఈ విధానంలో మార్పురావాలన్నారు. సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ కార్తీక వనభోజన మహోత్సవ విశిష్ఠతను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కె.రేఖ కార్యక్రమ విశిష్టతను తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరంలో వివిధ పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## టెక్కలి డీఎస్పీగా మూర్తి



(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి సబ్ డివిజన్ పోలీస్ అధికారి (డీఎస్పీ)గా డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు గురువారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. టెక్కలి పోలీస్ సబ్ డివిజన్‌లో 13 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. దీనికి డీఎస్పీగా మూర్తి బాధ్యతలు స్వీకరించనున్నారు. 1991లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కోటబొమ్మాళిలో తొలిసారి బాధ్యతలు స్వీకరించిన మూర్తి ఇప్పుడు అదే డివిజన్ కేంద్రం టెక్కలికి డీఎస్పీగా వస్తున్నారు. నందిగాం, నరసన్నపేట, వీరఘట్టం, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, టెక్కలిలో ఆయన ఎస్ఐగా పని చేశారు. అనంతరం సీఐగా టెక్కలి, నరసన్నపేట, పాతపట్నంలలో పని చేసి జిల్లాపై పూర్తి అవగాహన ఉన్న పోలీస్ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అనంతరం వైజాగ్ ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సీఐగా బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తుండగానే డీఎస్పీగా పదోన్నతి రావడంతో మహిళా పోలీస్ స్టేషన్, అనకాపల్లిలో దిశ పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. 2019 సమయంలో విశాఖ భూముల కుంభకోణంపై దర్యాప్తునకు వేసిన సిట్‌లో ఆయన డీఎస్పీగా పని చేశారు. ఆ తర్వాత విశాఖ సిటీలో ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తుండగా, శ్రీకాకుళం బదిలీ అయింది. ఇక్కడ కూడా ఉమెన్ పోలీస్ స్టేషన్, టౌన్ డీఎస్పీగా పని చేశారు. బదిలీపై విశాఖ స్పెషల్ బ్రాంచ్‌లో రూరల్, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో సేవలందించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా వైజాగ్ ఈస్ట్‌జోన్‌లో పని చేస్తూ బదిలీపై తాడేపల్లిగూడెం వెళ్లారు. విజయవాడ అవినీతి నిరోధక శాఖలో డీఎస్పీగా పని చేస్తున్న మూర్తిని ఇప్పుడు టెక్కలి డీఎస్పీగా కొత్త ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల తర్వాత తీసుకువచ్చారు. మూర్తికి జిల్లాపై పూర్తి అవగాహన ఉంది. దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలోనూ ఆయన ఏదో ఒక హోదాలో పని చేశారు. కోవిడ్ పాండమిక్ మొదటి సీజన్‌లో శ్రీకాకుళానికి మహమ్మారి చాలా ఆలస్యంగా రావడం వెనుక కృషి చేసిన యంత్రాంగంలో మూర్తి కూడా ఒకరు. శ్రీకాకుళం డీఎస్పీగా ఉన్న ఆయన డేంజర్ జోన్ ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారు. ఆ సమయంలో ఆయన కూడా కోవిడ్ బారిన పడి తీవ్ర అస్వస్తతకు గురయ్యారు.

## ప్రతిష్టను పెంచేలా సభ్యత్వాలు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఆదుకునేందుకు విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ ప్రతిష్టను పెంచాలని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు స్వాతి శంకర్ పిలుపునిచ్చారు. ఏడు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ కూడళ్లలో సభ్యత్వ నమోదు సెంటర్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.100 సభ్యత్వంతో రూ.5 లక్షల మేర బీమా సౌకర్యం కల్పించేలా టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు ఏర్పాటు చేసిందని చెప్పారు. సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నేతలు, కార్యకర్తలు రికార్డు స్థాయిలో నిర్వహించాలని స్వాతిశంకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)లో గురువారం యాంటి ర్యాగింగ్ అవగాహన సదస్సు మహిళా సర్కిల్ పోలీస్ స్టేషన్, కళాశాల ఎన్.ఎస్.ఎస్, యాంటీ ర్యాగింగ్ సెల్ సంయుక్త నిర్వహణలో కళాశాల ప్రిన్సిపల్ పి.సురేఖ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చక్కని నడవడిక అవసరమని, తాత్కాలిక ఆకర్షణకు లోనుకాకుండా విద్యాభ్యాసం చేయాలని కోరారు. చీఫ్ రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.త్రినేత్ర (మహిళా పోలీస్‌స్టేషన్) మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, యువతులను సోదరిలుగా భావించి గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఆర్.హరిత, యాంటీ ర్యాగింగ్ ఇన్‌ఛార్జి డి.రవీంద్ర, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ శ్రీనివాసపాత్రో, చలమయ్య, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దార్శనికుడు జవహర్ లాల్ నెహ్రూ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు యావదాస్తిని దేశం కోసం సమర్పించిన త్యాగనిరతి పండిట్ జవహర్లాల్ నెహ్రూ సొంతమని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్యసమరయోధులు సంఘసంస్కర్తల స్మృతివనంలో నెహ్రూ విగ్రహానికి దాతలు లోలుగు మదన్మోహన్, వావిలపల్లి జగన్నాథం నాయుడుతో పాటు హారికా ప్రసాద్, సురంగి మోహనరావు, మేడూరి ప్రసాదరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ బృందం పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ వారు జైల్లో నెహ్రూను బంధించినప్పుడు కూడా తన కుమార్తె ఇందిరాగాంధీకి దేశహితం కోసం చేయాల్సిన త్యాగాలను వివరిస్తూ ఉక్కుమనిషిగా తీర్చిదిద్దడం ఆయన దేశభక్తికి నిదర్శనమన్నారు. అనంతరం చిన్నారి మోక్షిత్ నెహ్రూ జన్మదినం విశేషాన్ని వివరించగా, అవధాన పండితులు పైడి హరనాథరావు గేయం ఆలపించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, మహిబుల్లాఖాన్, గుత్తు చిన్నారావు, పందిరి అప్పారావు, కొమ్ము రమణమూర్తి, టెక్కం రాంగోపాల్, కె.ఆర్.నాయుడు, తర్లాడ అప్పల నాయుడు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

● ఎడిటోరియల్

# పెళ్లికి కాదు.. చదువుకు ఇవ్వండి పథకాలు

'మనలో సగం మందిని వెనక్కి నెట్టేసినపుడు మనమందరం విజయం సాధించలేము' అంటారు నోబుల్ పురస్కార గ్రహీత, పిల్లల హక్కుల కార్యకర్త మలాల యూసుఫ్‌జారు. అవనిలో సగం.. ఆకాశంలో సగం.. సమాజంలో సగం.. అంటూ గొప్పగా చెప్పుకుంటున్న అమ్మాయిలు విద్యావకాశాల్లో మాత్రం నేటికీ ఆమడ దూరంలో ఉన్నారనేది లెక్కలు చెబుతున్న వాస్తవాలు. 'అమ్మాయి చదువు ఇంటికి వెలుగు' అనేది పాత నానుడి. అయితే 'అమ్మాయి చదువు సమాజానికి వెలుగు' అనేది నేటి అవసరం. కానీ ఈ అవసరాన్ని గుర్తించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. అందుకే కొందరు బాలికలు విద్య ఇంకా అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. సగం మంది అమ్మాయిలు ప్రాథమిక స్థాయిలోనే చదువుకు దూరమవుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. 'బాల్య వివాహాలు, రోజురోజుకు పెరిగిపోతున్న లైంగిక వేధింపులు, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో బాలికలు చదువులో వెనకబడుతున్నారు' అనే విషయాన్ని ఇటీవల నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్సీపీసీఆర్) మాజీ చైర్‌పర్సన్, మెగసెసే అవార్డు గ్రహీత శాంతా సిన్హా నొక్కి చెప్పారు. వారి బృందం కింది స్థాయి వరకు అధ్యయనం చేసి వెలికితీసిన నిజాలివి. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ మధ్య కాలంలో తల్లిదండ్రుల ఆలోచనల్లో కొంత మార్పు వస్తోంది. అబ్బాయిలతో సమానంగా తమ ఆడపిల్లలనూ బాగా చదివించాలని కోరుకుంటున్నారు. అయితే సమాజంలో, ప్రభుత్వ విధానాల్లో ఏమాత్రం పెద్దగా మార్పు రావడం లేదు. ఇదే అమ్మాయిల చదువుకు ప్రధాన సవాలుగా మారిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. మన ప్రభుత్వాలు అమ్మాయిల చదువుకు ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదు. నేటికీ 70 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడమే ఇందుకు నిదర్శనం. మరీ ముఖ్యంగా గ్రామీణ భారతంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కొన్నిచోట్ల ఉన్నా వాటిని వినియోగించుకునేందుకు నీటి సౌకర్యం ఉండదు. దాంతో అవి మురికి కూపాలకు ఆనవాళ్లుగా మారిపోయాయి. దీనివల్ల యుక్త వయసుకు వచ్చిన అమ్మాయిలు పాఠశాలలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని, మధ్యలోనే చదువు మానేస్తున్నారని పలు సర్వేల్లో బయటపడిన వాస్తవం. 'కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అంటూ అమ్మాయిలు పెండ్లి చేసుకునేందుకు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వాలు తెగ పోటీ పడుతున్నాయి. అమ్మాయిల పెళ్లికి చూపిస్తున్నంత ఆసక్తి చదువుకు మాత్రం చూపించడం లేదు' అంటూ శాంతాసిన్హా చేసిన విమర్శలో నిజం లేకపోలేదు. బాలికలను వంటింటికే పరిమితం చేయాలనే పురుషాధిక్య భావజాలాన్ని ప్రభుత్వాలే పనిగట్టుకొని మరీ ప్రచారం చేస్తున్నాయి. అందుకే విద్యావకాశాలు మెరుగుపరిచేందుకు నిధులు కేటాయించడం లేదు. పాఠశాలల్లో, హాస్టళ్లలో అమ్మాయిలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టడం లేదు. ఇక కేంద్రం జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టింది. కానీ దానికి అవసరమైన నిధులు మాత్రం కేటాయించలేదు. ఈ విధానంలో తీసుకొచ్చిన అత్యాధునిక మార్పులను అందుకోలేక పేదలకు విద్య మరింత ఆర్థిక భారం కాబోతోంది. ఈ భారానికి ముందుగా బలయ్యేది బాలికలే. ఏది ఏమైనా మహిళలకు సాధికారత కల్పించేందుకు అత్యంత ముఖ్యమైన సాధనాల్లో విద్య ఒకటి. మెరుగైన ప్రపంచాన్ని నిర్మించడానికి బాలికా విద్య చాలా కీలకం. అమ్మాయిల చదువు వారి జీవితాలను, కుటుంబాలనే కాదు సమాజాన్ని కూడా సమర్థవంతంగా మార్చగలదు. ఆర్థిక అవకాశాలను మెరుగుపరుస్తుంది. వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. జీవితంలో సొంత నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. అందుకే ప్రతి ఆడపిల్లకు నాణ్యమైన విద్య అందించేలా చూడడం చాలా అవసరం. ఇవన్నీ అందరూ ఒప్పుకునే నిజాలే. కానీ వీటిని సాధించడంలోనే అసలు సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రభుత్వాలు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నాయి. ప్రతి అమ్మాయి అభివృద్ధి చెందడానికి, ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడే సమాజాన్ని సృష్టించాల్సిన అవసరం మనందరిపై ఉంది. తమ బాధ్యతల నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వాలను నిలదీయాల్సిన అవశ్యకత నేటి పౌరసమాజంపై ఉంది. అమ్మాయిల అభివృద్ధికి ఆటంకంగా మారిన పాలకులను ప్రశ్నించాలి. వారి భవితకు బంగారు బాటలు పడాలంటే ప్రభుత్వాలు సన్నద్ధం కావాలి. స్వేచ్ఛగా పాఠశాలలకు వచ్చేలా ప్రోత్సహించాలి. బాలికా విద్యకు పెట్టుబడి పెట్టడం అనేది తమ నైతిక ఆవశ్యకతగా ముందు ప్రభుత్వాలు గుర్తించాలి. దీనికోసం నిబద్ధతతో కృషి చేయాలి. అప్పుడే బాలికా అభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా సమాజం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుంది.



మన దేశంలో ఏటా 1.5 మిలియన్ బాల్య వివాహాలు జరుగుతున్నాయి. దీనివల్ల ఆ అమ్మాయి ఎన్ని ఇబ్బందులు పడుతుందో, జీవితం ఎంత కష్టంగా మారుతుందో.. అనుభవించిన వారికి మాత్రమే తెలుస్తుంది. అలాంటి అనుభవం నుంచి కోలుకున్న మహిళ నేడు బాల్యవివాహాలను అడ్డుకుంటూ ఎంతోమందిని ఈ చెర నుంచి కాపాడుతుంది. తన పేరు రోష్నీ పర్వీన్. బీహార్‌కు చెందిన రోష్నికి 13 ఏళ్లకే తన తల్లిదండ్రులు బలవంతంగా 45 ఏళ్ల వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. 15 ఏళ్లకే చేతిలో ఓ బిడ్డ. భర్త పెట్టే బాధలు భరించలేక పుట్టింటికి వచ్చింది. అక్కడా తనకు నీడ దొరకలేదు. ఇటు భర్తకు, అటు పుట్టింటికి దూరమైన రోష్నీ అంత చిన్న వయసులోనే తన కొడుకుకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే సంకల్పంతో షోరూంలో పని చేయడం ప్రారంభించింది.

# గ్రామీణ బాలికల ఆశాజ్యోతి!

## - 60కి పైగా బాల్యవివాహాలను అడ్డుకున్న రోష్నీ - సేవలకు గుర్తుగా ఐక్యరాజ్యసమితి సత్కారం




ఇప్పుడు 24ఏళ్ల రోష్నీ బీహార్‌లోని గ్రామీణ బాలికలకు ఆశాజ్యోతిగా మారింది. సమాజంలో బాల్య వివాహాలను నిరోధించడానికి, అక్రమ రవాణా బారి నుంచి బాలికలను రక్షించడానికి తనను తాను అంకితం చేసుకుంది. సేవ్ ది చిల్డ్రన్, యునిసెఫ్ వంటి సంస్థల సహకారం ద్వారా చిన్న వయస్సులోనే వివాహం చేసుకోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించడానికి, వారి భవిష్యత్తును తిరిగి పొందేందుకు యువతులకు సాధికారత కల్పించడానికి అనేక కార్యక్రమాలు చేస్తోంది. రోష్నీ ఇప్పటి వరకూ 60కి పైగా బాల్య వివాహాలను అడ్డుకుంది.

ఆమె సేవలకు గుర్తుగా 2022లో స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆమెను సత్కరించింది. రోష్నీ.. సిమల్వారి, బగల్వారి, మహేశ్‌భట్నా, కొచ్చాధమన్, బహదుర్‌గంజ్, దిఘల్‌బ్యాంక్ వంటి గ్రామాల్లో 15 కౌమార బాలికల సమూహాలను ఏర్పాటుచేసి విద్యపై, బాల్య వివాహాలపై అవగాహన కల్పించి బాలికలకు బలమైన పునాదిని ఏర్పాటు చేసింది.

కౌన్సిలింగ్ ద్వారా తల్లిదండ్రులు వివాహం ఆపడానికి ఒప్పుకోకపోతే జిల్లా యంత్రాంగం నుంచి సహాయం తీసుకుంటుంది. జిల్లా మేజిస్ట్రేట్, ఎస్‌డీఎం (సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్), బీడీవో (బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్), పోలీస్, సీడీపీవో (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రా జ ె క్ట



ఆఫీసర్), ఇతర అధికారులతో కలిసి వెళ్లి వివాహాన్ని అడ్డుకుంటుంది.

మన దేశంలో అత్యధికంగా బాల్య వివాహాలు జరిగే రాష్ట్రం బీహార్.. ఇక్కడ ప్రతి ఇద్దరు బాలికల్లో ఒకరు 18 ఏళ్లు నిండకముందే వివాహం చేసుకుంటున్నారు. ఎన్నో సంఘాలు, మరెన్నో కమ్యూనిటీలు, రోష్నీ లాంటి యాక్టివిస్టులు కలిసి బాల్య వివాహాలను నియంత్రించేందుకు పోరాడుతున్నా ఈ యుద్ధంలో పూర్తిస్థాయిలో విజయం ఇంకా సాధించలేకపోతున్నారు. పేదరికం, అవగాహన లేమి, సరైన విద్య లేకపోవడం, సరైన వసతులు లేకపోవడం లాంటి ఎన్నో కారణాల వల్ల ఆడపిల్లలు అక్కడ బాల్య వివాహాలకు గురవుతున్నారు.

'భారతదేశాన్ని బాల్య వివాహాలు లేని దేశంగా చూడాలన్నదే నా కల, దాని కోసం ఎన్ని అవమానాలు, అడ్డంకులు ఎదురైనా సరే నిరంతరం కృషి చేస్తా' అని రోష్నీ అంటున్నారు. రోష్నీ లాంటి వాళ్లు బీహార్ లాంటి రాష్ట్రానికి ఇంకా కావాలి. అప్పుడే ఈ సమస్య తగ్గుతుంది. చుట్టూ చీకట్లు కమ్ముకున్నా.. ఆగిపోకుండా అలిసిపోకుండా శ్రమిస్తున్న రోష్నీని మనం అభినందించాల్సిందే..!!

- సత్యం ఐటీ డెస్క్





ముఖ్యమంత్రులుగా పనిచేసిన సినీ స్టార్స్ చేత అదిరిపోయే స్టెప్పులు వేయించిన ఖ్యాతి ఆయనది. ఆ రోజుల్లో వారి పాటలు,నృత్యాలు చూసి ప్రేక్షకులు ఈలలు, కేకలు, చప్పట్లతో హర్షం వ్యక్తం చేసేవారు. ముఖ్యమంత్రులు నాటి సినీ స్టార్స్ ఎన్టీఆర్, ఎంజీఆర్, జయలలిత లు కాగా వారిచే స్టెప్పులు వేయించింది మరెవరో కాదు డాన్స్ మాష్టారు సలీం. ఈ తరం వారికి అంతగా తెలియని చరిత్ర సలీం ది . డాన్స్ మాష్టారు సలీం 80 వ దశకంలో చిత్ర పరిశ్రమను ఒక ఊపు ఊపేసిన కొరియోగ్రాఫర్ . అప్పట్లో ఆయన డాన్సు అంటే విపరీతమైన క్రేజ్.పెద్ద పెద్ద స్టార్స్ కూడా సలీం ను ప్రిఫర్ చేసేవారు. సలీం కూడా తనకు వచ్చిన అవకాశాలను ఏమాత్రం జారవిడుచుకోకుండా నృత్యాలలో తన ప్రతిభను ప్రదర్శించేవాడు. అడవిరాముడు లో 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' అన్నపాటకు ఎన్టీఆర్ జయప్రదలకు నృత్యరీతులు కూర్చింది సలీమే. అలాగే ఊరికి మొనగాడులో హీరో కృష్ణ జయప్రదల హిట్ సాంగ్ 'ఇదిగో తెల్లచీర ' కు స్టెప్స్ కూర్చింది సలీమే.

అప్పటి హీరోలు దిలీప్‌కుమార్, శివాజీ గణేశన్, నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్‌లతో పనిచేసిన సలీం తర్వాత తరం హీరోలైన చిరు, నాగార్జున, వెంకటేష్, బాలకృష్ణలతో కూడా పని చేసాడు. హీరోలను బట్టి, వారి బాడీ కదలికలను బట్టి స్టెప్స్ రూపొందించేవారు. ఆయన దగ్గర అసిస్టెంట్స్‌గా చేరిన ఎందరో తర్వాత కాలంలో డాన్స్ మాష్టార్లుగా ఎదిగారు. పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

## సీఎంలతోనే డ్యాన్సులేయించాడు.. ప్రేక్షకులతో ఈలలేయించాడు..

# చివరకు దీనంగా వెళ్లిపోయాడు!

హీరో చిరంజీవి సూపర్‌హిట్ సాంగ్ ఖైదీలోని 'రగులుతోంది మొగలి పొద' కు సలీం కూర్చిన నృత్యభంగిమలు చాలాపాపులర్ అయ్యాయి. ప్రేక్షకుల చేత కూడా థియేటర్లో డాన్సులు వేయించిన ఘనత సలీం దే. సలీం డాన్సులో ఏదో మ్యాజిక్ ఉండేది. మాస్ నాడి పట్టిన కొరియోగ్రాఫర్ సలీం. సలీం డేట్స్ కోసం నిర్మాతలు పోటీ పడేవారు.

సలీం జన్మతః మలయాళీ.. అయినా తమిళ,తెలుగు వారిలో కలిసిపోయేవాడు. కేరళ లోని కన్నూరు ప్రాంతానికి చెందిన సలీం నిరుపేద కుటుంబం నుంచి తమిళనాడుకి వలస వచ్చాడు. తొలుత సినిమా వాళ్ళకు డ్రెసెస్ కుట్టే టైలర్ల వద్ద సహాయకుడిగా చేరాడు.

తండ్రి కూడా దర్జీయే కాబట్టి ఆ పని చేయడానికి సలీం సిగ్గుపడలేదు. చోప్రా అనే నృత్య దర్శకుడి కి వ్యక్తిగత సహాయకుడిగా చేరాడు. ఆ తర్వాత ప్రముఖ కొరియోగ్రాఫర్ గోపికృష్ణ వద్ద అసిస్టెంట్‌గా చేరాడు. ఆయన వద్దనే నాట్యంలోని మెళకువలు నేర్చుకున్నాడు. ఏదైనా ఒకసారి చూస్తే ఇట్టే పట్టేసే నేర్పరి కావడంతో మెల్లగా నృత్య రీతులపై పట్టు సాధించాడు.

1970లో తమిళ సినిమా "పెన్ఇన్రాల్వెన్"కి నృత్యదర్శకుడు అయ్యాడు. అప్పటి నుంచి నుంచి వెనుదిరిగి చూడలేదు. తెలుగు పరిశ్రమలోకి 'నా తమ్ముడు' చిత్రం తో ప్రవేశించాడు. వెరైటీ మాస్ నృత్య భంగిమలు , డాన్సులు, స్టెప్పులు అతగాడిని ఎక్కడికో తీసుకెళ్లాయి. ఎన్టీఆర్ నిర్మాతలు సలీం నే పిలిపించే వారు.

ఒక దశలో సలీం వేరే సినిమా షూటింగ్ కోసం ఏదైనా లొకేషన్‌కి వెళితే నిర్మాతలు,దర్శకులు హీరోలు.. హీరోయిన్లతో ఆ లొకేషన్ కే వెళ్లి అక్కడే పాటల చిత్రీకరణ పూర్తి చేసుకునేవారు. అంత బిజీగా సలీం ఉండేవారు. సలీం సుమారు 300 చిత్రాలకు డాన్స్ మాస్టారుగా పని చేశారు. అందులో తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ సినిమాలున్నాయి.

చిత్రపరిశ్రమలో ఒక వెలుగు వెలిగిన సలీం ఒక ఘటనతో జైలు పాలయ్యారు. దాంతో అతని జీవితం మారిపోయింది. సలీంకి టీ-నగర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఉండేది. అందులో ఒక షాప్ అతను సరిగ్గా అద్దె చెల్లించకపోవడంతో సలీం తన మనుష్యులను పంపి అతగాడిని ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు.

ఆ సందర్భంగా జరిగిన ఘర్షణలో షాప్ అతను మరణించారు. అది కేసు అయింది. ఆ కేసులో సలీం అరెస్ట్ అయ్యారు. మానసికంగా కూడా దెబ్బ తిన్నారు. అరెస్ట్ కావడం, జైలుకెళ్లడం తదితర సంఘటనల నేపథ్యంలో కుటుంబసభ్యులు ఉన్న ఆస్తులు అమ్ముకుని కేరళ వెళ్లిపోయారు.

తర్వాత సలీం గురించి పట్టించుకోలేదని అంటారు. బెయిల్‌పై బయటకొచ్చిన తర్వాత నిలదొక్కుకోవడానికి ప్రయత్నించారు కానీ నిర్మాతలు,హీరోలు పట్టించుకోలేదు. సలీం జైలుకెళ్లిన ఘటనపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

కోట్లు సంపాదించిన సలీం దాన ధర్మాలు ఎక్కువగా చేయడంతో మిగుల్చుకున్నది కూడా పెద్దగా ఏమీలేదు. వృత్తి పట్ల అధిక శ్రద్ధ చూపిన సలీం కుటుంబాన్ని కూడా పెద్దగా పట్టించుకోలేదు. ఆయన జైలుకి వెళ్ళాక కుటుంబం కూడా దూరమైంది. కొన్నిరోజులు హైదరాబాద్ లో ఉండి సినిమా ఛాన్సుల కోసం ప్రయత్నాలు చేసాడు.కానీ అవకాశాలు రాలేదు. అతని శిష్యులు కూడా పట్టించుకోలేదు.

చివరి రోజుల్లో చెన్నైలోని ఒక మురికివాడలో కొంత కాలం నివసించాడు. అక్కడ నుంచి ఒక కారు షెడ్డులోకి మారాడు. ఆరోగ్యం క్షీణించడం, మానసిక వ్యధ సలీం ను బలి తీసుకున్నాయి. అత్యంత దయనీయ స్థితిలో ఒక స్టార్ కొరియో గ్రాఫర్ అలా ఈ లోకం నుంచి నిష్క్రమించాడు.

చివరికి శవదహనానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయం తెలిసి ఇప్పటి హీరోలు సూర్య, కార్తీల తండ్రి నటుడు శివకుమార్ ముందుకొచ్చి శవదహన కార్యక్రమాలు చేపట్టారు. అదండీ సలీం విషాద గాథ.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

# టూపీస్‌లో తుఫాన్‌లా పాండే బ్యూటీ!

నేటితరంలో స్పీడున్న భామగా అనన్య పాండే పేరు ఎంతో పాపులరైంది. నటవారసుల్లో అనన్య యూనిక్ బ్యూటీ. వరుస ఫోటోషూట్లతో అమ్మడు నిత్యం నెట్టింట వైరల్ అవుతుంటుంది. అనుభవం కొద్ది రాటు దేల్తారు అన్నట్లు అనన్య కూడా ఫ్యాషన్ వరల్డ్ లో అలాగే రాటుదేలుతోంది. ఫ్యాషన్ ఎంపికల్లో తనదైన మార్క్ వేస్తుంది. సెగలు పుట్టించే ఫోటోలతో కుర్రాళ్ల గుండెల్లో గుబులు పుట్టిస్తుంది.

తాజాగా అమ్మడు బీచ్ ఒడ్డున టూపీస్‌లో తుఫాన్‌లా విరుచుకు పడింది. వెనుక అందమైన నీలి సముద్రం..కాళ్ల కింద అంతే అందమైన తెల్లని ఆ పై అనన్యా పాండే హొయలు చూపరులను కనులు తిప్పనివ్వేలేదు. సెమీ గ్రే కలర్ పీసుల్లో అమ్మడు అందాలు టాప్ టూ బాటమ్ ఓ రేంజ్ లో ఫోకస్ అయ్యాయి. పాండే బ్యూటీ స్కిన్ షో ఆద్యంతం మైమరిపించింది.

ఇంకా మరికొన్ని పిక్స్‌లోకి వెళ్తే అందమైన అద్భుతమైన లొకేషన్లు ఎన్నో ఉన్నాయి. నడుము లోతు నీటిలో జలకాలాడుతోంది. బీచ్ బ్యూటీని ఆస్వాదిస్తూ బుక్ సైతం చదివేస్తోంది. ఎత్తైన ప్రదేశం నుంచి క్యాప్చర్ చేసిన ప్రతీ లొకేషన్ ఓ వండర్ లా ఉంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఓ వైపు అనన్య అందాలు.. మరో వైపు విదేశీ అందాలతో నెటి జనులు చూపులు తిప్పనివ్వడం లేదు. ఇక బాలీవుడ్ లో అమ్మడి కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగులో లైగర్ ఫ్లాప్ అయిన అనంతరం అక్కడ ఏమాత్రం సమయం వృద్ధా చేయకుండా బాలీవుడ్ కి వెళ్లిపోయింది. లక్కీగా అవకాశాలు బాగానే అందుకుంది. ఇప్పుడిప్పుడే సక్సెస్ బ్యూటీగా పికప్ అవుతుంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో రెండు..మూడు సినిమాలున్నాయి.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...





ఆనందానికి ఒక నగరం ఆనందం.. పరమానందం.. బ్రహ్మానందం. మాటలకు వేదాంత కోణంలో వేరే అర్థాలున్నా - మనం లౌకిక అర్థమే చూద్దాం. ఆనందం వెతుక్కోవడంలోనే మనం తికమకపడుతున్నాం. ఆనందం కానిది ఆనందం అనుకుని పరుగులు తీస్తున్నాం. జీవితం ఎప్పుడూ సరళరేఖ కానేకాదు. ఒకే వేగం, ఒకే పద్ధతిలో వెళ్లదు. ఎగుడు దిగుళ్లు - లాభనష్టాలు - కష్టసుఖాలు సహజం. అయితే లాభమూ సుఖమూ ఆనందించదగ్గది, నష్టమూ కష్టమూ భరించకూడనిది అవుతుంది. ఇక్కడే వస్తోంది చిక్కంతా. జీవితం సంక్లిష్టం కావాలని ఎవరూ కోరుకోరు. కానీ సంక్లిష్టమైనప్పుడు బయటపడడానికి, ఆ ప్రయత్నంలో ఆనందం వెతుక్కోవడానికి ప్రయత్నించేవారు తక్కువ. ఆనందం దానికదిగా వస్తువు కాదు. మార్కెట్లో దొరకదు. ఆనందం అక్షరాలా మనకు మనమే తయారు చేసుకోవాల్సిన పదార్థం. మనలో మనమే వెతికి పట్టుకోవాల్సిన వస్తువు. మన లోపలే ఉన్నా మనం లేదనుకుని వెతికే ఫీలింగ్. ఒక అనుభూతి. ఒక మానసిక స్థితి. మరి మన లోపలే ఆనందం టన్నుల కొద్దీ ఉంటే మనకెందుకు కనిపించదు? అనిపించదు? గెలుపు ఆనందం, ఓటమి బాధ. స్థూలంగా ఆనందానికి - బాధకు మన నిర్వచనం ఇది.

# అభివృద్ధిని 'ఆనందపు లెక్కల్లో' కొలిచే దేశం!

## మరో కొత్త ఆలోచన!



లక్ష్యం గమ్యం ఆనందం. చేరేదారి, గమనం బాధ. నొప్పి, అసహ్యం, అసహనం, అసంతృప్తి. గమ్యంతో పాటు గమనాన్ని, చేరే దారిని కూడా ఆనందించాలి, ప్రేమించాలి, అనుభవించాలి. జీవితం చాలాసార్లు సవాళ్లు విసురుతుంది. ఇక మార్గమే లేనట్లుగా చేస్తుంది. బరువుగా మారుతుంది. దిగులుగా చేస్తుంది. నీరసపరుస్తుంది. నిస్పృహ నింపుతుంది. మొండిగా బండగా మారుస్తుంది. కానీ ఇలాంటి సమయాల్లో కూడా ఆనందాలను వెతుక్కోవాలి. అలవికాని ఆశలు, అంచనాలు, ఇతరులతో పోలిక, ఇతరులు ఏమనుకుంటారోనన్న ఆందోళనలు వదిలేస్తే ఎన్నెన్నో ఆనందాలు కళ్లముందే ప్రత్యక్షమవుతాయి.

బాధ - కృతజ్ఞత రెండూ ఒక ఒరలో ఒదగవు. చెప్పుల్లేనివాడు పొర్లి పొర్లి ఏడుస్తున్నాడు. ఎవరూ ఓదార్చలేకపోయారు. అయితే రెండు కాళ్లు లేనివాడిని చూసేసరికి అతడి ఏడుపు ఆగిపోయింది. కాళ్లు లేనివాడి గురించి కన్నీళ్లు ఉబికాయి. ఇప్పుడు అతడిది బాధ కాదు - సహానుభూతి, సానుభూతి, పరిపక్వత. కాళ్లున్నందుకు ఆనందం, కృతజ్ఞత. అలా లేనివాటికంటే ఎన్నో మనకున్నవాటికి ఎంత కృతజ్ఞతతో ఉండాలి? చాలామంది డబ్బు, కార్లు, ఇళ్లు, విలాసాల్లో ఆనందం ఉందనుకుని వాటి కోసమే ఆగని పరుగుల్లో ఉన్నారు. ఆ పరుగుల్లో నిజానికి ఆనందం తప్ప అన్నీ దక్కించుకుంటున్నారు. ఎంతో కష్టపడి, పరుగులుతీసి సంపాదించుకున్నవి ఎక్కడ పోతాయోనని బతికినంత కాలం బాధపడుతూ ఉంటారు. ఆశకు అంతే లేదు. చిన్న చిన్న బంధాలు, ప్రేమలు, స్నేహాలు, ఇష్టాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు, చేతనైన సాయం చేయడాల్లో అంతులేని ఆనందాలు దాగి ఉన్నాయి. జీవితంలో బ్యాంక్ బ్యాలన్స్, ఇతర సంపదలు పోగు చేసినట్లే - ఆనందం పోగు చేయడానికి ఏమి చేస్తున్నామో మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. చేయకూడనివి ఏవి చేస్తూ ఆనందాలకు






దూరమవుతున్నామో సమీక్షించుకోవాలి. చుట్టూ ఉన్న వాతావరణాన్ని, మనుషులను నిత్యం ద్వేషిస్తూ ఉంటే - ప్రతిఫలంగా ద్వేషమే వస్తుంది. చాలాసార్లు పరిస్థితులను యథాతథంగా, లోతుగా కార్య కారణ సంబంధాలతో అర్థం చేసుకోవడమే ఆనందమవుతుంది. అర్థం కాకపోతే అదే అయోమయం, బాధగా మారుతుంది. ఫిన్లాండ్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, నార్వే, ఆస్ట్రేలియా, స్వీడన్ లాంటి దేశాలు ప్రతి ఏటా ప్రపంచ ఆనంద పద్దులో ముద్దుగా ముందు వరుసలోనే ఎలా ఉంటాయని ఆలోచించే తీరిక, ఓపిక భారతీయులుగా మనకు ఉండవు.

ఐఐటీ ఎండమావుల వెంట అక్షరాభ్యాసంనాడే పరుగులు తీసే భారతీయ తల్లిదండ్రుల ఆనందాన్ని కొలిచే పరికరాలు, సూచీలు ఐక్యరాజ్య సమితి దగ్గర ఉండి ఉండకపోవచ్చు. అన్నప్రాసన నాడే అమెరికా గ్రీన్ కార్డ్ రంగుల కలలు కనే భారతీయ సగటు కుటుంబం ఆనందాన్ని బేరీజు వేసే త్రాసులు ఐక్యరాజ్యసమితి దగ్గర ఉండి ఉండకపోవచ్చు. సినిమా హీరో కోసం బ్లేడ్లతో కోసుకుని తొలిరోజు స్పెషల్ షోకు నాలుగు రెట్లు టికెట్ రేటు ఎక్కువ పెట్టి రక్తం ధారపోయడంలో ఉన్న సైకో ఫ్యాన్స్ ఉన్మత్త అమితానందాన్ని లెక్కకట్టే ప్రమాణాలు ఐక్యరాజ్యసమితి దగ్గర ఉండి ఉండకపోవచ్చు. కల్చర్ లెస్ పీపుల్ అని ఎదుటివారిని తిడుతూ అదే నోటితో నడి రోడ్డు మీద కేకరించి ఉమ్మేసే మన ఆనందాన్ని నిర్వచించే సూత్రాలు ఐక్యరాజ్య సమితి దగ్గర ఉండి ఉండకపోవచ్చు. బ్లడీ పీపుల్ కామన్ సెన్స్ ఉండదు అని తిడుతూ ఇంటి ముందు రోడ్డును సొంత ఆస్తిగా షామియానాలు వేసి శుభాశుభ కార్యాలు చేయడంలో, రోడ్డును అడ్డగిస్తూ పార్కింగులు చేయడంలో, రాంగ్ రూట్లో వెళుతూ ఎదుటివారిని తిట్టడంలో ఉన్న భారతీయుల ఆనందాన్ని ఐక్యరాజ్యసమితి పరిగణనలోకి తీసుకోదు. లేకపోతేనా! భారతదేశం దరిదాపుల్లోకి రాగల దేశం ఈ భూమండలంలో ఒక్కటైనా ఉంటుందా?

**సందర్భం:-** భూటాన్‌లో 2,500 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో 'ఆనంద నగరం' నిర్మాణానికి పనులు ప్రారంభించారు. 'మైండ్ ఫుల్ నెస్ సిటీ'గా దీనికి నామకరణం చేశారు. ఎన్ని అత్యాధునిక వసతులు ఇందులో ఉన్నా.. ఎంతగా పరిశ్రమలు వచ్చినా.. ఈ కొత్త నగరంలో వాహనాలకు అనుమతి ఉండదు. శబ్ద, వాతావరణ కాలుష్యానికి చోటు లేదు. నిరుద్యోగం ఉండకూడదు. ప్రశాంతతకు భంగం కలగకుండా ఇక్కడ ఉండబోయేవారికి ప్రత్యేక విధి విధానాలను రూపొందించారు. శారీరక, మానసిక ఆరోగ్యమే ఇక్కడ పరమావధి కానుంది. అంతా అనుకున్నట్లు జరిగితే మంచిదే. ఇలాంటి నగరాలు భారత్‌లో కూడా చాలా కావాలి. రావాలి.

**కొసమెరుపు:-** దేశాల ఆనందాన్ని తక్కెడలో పెట్టి కొలిచి మిల్లీగ్రాములతో పాటు లెక్కలు తేల్చడానికి ఐక్యరాజ్యసమితి దగ్గర సున్నితపు త్రాసులేమీ ఉండవు. స్థూలంగా వాళ్ల లెక్కలేవో వాళ్లకుంటాయి. భారత్, చైనా లాంటి అత్యధిక జనాభా ఉన్న దేశాల్లో ఎన్ని మౌలిక వసతులు పెరిగినా, ఎంతగా సాంకేతికత అంది వచ్చినా, ప్రభుత్వాలు ఎంత చేసినా పూట గడవనివారు కోట్లలో ఉంటారు. నిలువ నీడ లేనివారు కోట్లలో ఉంటారు. రోగమొస్తే ఆసుపత్రికి మైళ్లు నడవాల్సినవారు కోకొల్లలుగా ఉంటారు. రెండు, మూడు తరాల కిందటితో పోల్చుకుంటే భారత్ ఇప్పటి ప్రాభవం చిన్నదేమీ కాదు. ఎంత చెట్టుకంత గాలి. ఎవరి ఆనందం వారిది. మన దేశంలో ఒక జిల్లా అంత కూడా లేని ఇంకేదో దేశపు ఆనందంతో పోల్చి చూసుకోవడం వల్ల మనకు మిగిలేది నిరాశ, నిస్పృహలే.

**- పమిడికాల్వ మధుసూదన్**







- పొలమే ప్రయోగశాల - దేశవాళీ విత్తనాలకు భరోసా
- 2020లో పద్మశ్రీ అవార్డు
- చదువు లేకపోయినా రైతులకూ, వ్యవసాయ విద్యార్థులకూ పాఠాలు

# సీడ్ మదర్!

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలోని అకోలే అనే గిరిజన గ్రామానికి చెందిన రాహీబాయ్ సోమ్ పోపెరే దేశవాళీ విత్తనాల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుంది. సీడ్ మదర్‌గా ఈమె ప్రసిద్ధి చెందారు. చదువు లేదు.. అయినా నేడు ఎంతోమంది రైతులకు వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నారు. అంతరించిపోతున్న విత్తనాలను కాపాడుతున్నారు. ఈమె సేవలకు గుర్తుగా 2020లో



కేంద్రం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన రాహీబాయ్.. పెళ్లయ్యాక కూడా వ్యవసాయాన్ని వదల్లేదు. భర్త కుటుంబానికీ వ్యవసాయమే ఆధారం. వ్యవసాయంలో లోటుపాట్లను దగ్గర నుంచి చూసిన ఆమె.. పొలాన్ని ప్రయోగశాలగా మార్చి కొత్త కొత్త పద్ధతుల్లో సేద్యం చేసేది. సేంద్రియ సాగు చేయడమే కాకుండా ఇతరులకు మెళుకువలు నేర్పించడం, దేశవాళీ విత్తనాలను భద్రపరచడం మొదలుపెట్టారు. ఓ ఎన్జీవో సహకారంతో తన ఇంటి పరిసరాలలో దాదాపు 200 రకాల



దేశవాళీ విత్తనాలతో కూడిన విత్తన భాండాగారాన్ని ఏర్పాటుచేశారు. చుట్టుపక్కల ప్రాంతాల రైతులకూ, స్వయం సహాయక బృందాలకు వీటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఆమె దగ్గర ప్రస్తుతం 32 రకాల పంటలకు సరిపడే 122 రకాలు విత్తనాలు ఉన్నాయి. ఇందులో 15 రకాల బియ్యం, 60 రకాల కూరగాయలు, తొమ్మిది రకాల బఠానీలు, అనేక నూనె గింజలు ఉన్నాయి. తను స్థాపించిన కల్సుబాయి పరిసార్ బియానీ సంవర్ధన్ సమితి అనే స్వయం సహాయక బృందంతో మహిళా రైతులను విత్తన పరిరక్షణలో పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది. రైతులకూ, వ్యవసాయ విద్యార్థులకూ పాఠాలు చెబుతున్నారు. ఇలా ఇప్పటి వరకూ కనీసం 3500 మందికి పైగా రైతులు శిక్షణ పొందారు. 60 ఏళ్ల వయసులో కూడా రహీబాయ్ వ్యవసాయంపై మక్కువతో చేస్తున్న కృషి నేడు ఎంతోమంది యువ రైతులకు ఆదర్శం.

**- సత్యం ఐటీ డెస్క్**

## మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా 80 అడుగుల కూడలి, వాంబే కాలనీలో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డా. బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మధుమేహ వైద్యశిబిరానికి విశేష స్పందన కనిపించింది. పాదచారులకు, ఉదయం నడకకు వచ్చేవారితో పాటు, పరిసర ప్రజలు పాల్గొని బీపీ, షుగర్ పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ మంచి అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అధిక మూత్రం, నీరసం, ఎక్కువ బరువు, అస్వభావిక దాహం, వాంతులు, అసాధారణ ఆకలి, నిద్రమత్తుగా ఉండటం, త్వరగా అలసట చెందడం, దురదలు, చిరాకుపడుట, చూపు సన్నగిల్లుట, త్వరగా మానని గాయాలు లాంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లతో మంచి ఆరోగ్యం లభిస్తుందని మెంటర్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెంట్రల్ కోశాధికారి జోగి భారతి, మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లాం శివతేజ, టెక్కం రామ్‌గోపాల్, శిల్లా మని, ఉమా కవి, పొడుగు చరణ్, సన్‌రైజ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, బోస్ మాస్టర్, జనసేన నాయకులు సైలాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001



గురువారం అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మాజీ స్పీకర్ కావలి ప్రతిభ భారతి, ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కావలి గ్రీష్మ, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. - సత్యంన్యూస్, అమరావతి

## బాలల హక్కులు కాపాడాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాలల హక్కులను కాపాడడంలో తల్లిదండ్రులతో పాటు అధికారులు, సమాజం, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాల్సిన అవసరముందని వక్తలు పేర్కొన్నారు. స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొమ్ము రమణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పర్యవేక్షణలో బాలల హక్కుల వారోత్సవాలు పోస్టర్‌ను వివిధ రంగాల ప్రముఖులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడుతూ సమాజ ప్రయోజకులుగా తీర్చిదిద్ద డంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. విద్యా వేత్తలు సురంగి మోహనరావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ దేశ సౌభాగ్యం, ఉత్త మ బాలల నిర్మాణంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు హారికా ప్రసాద్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, జామి భీమ శంకర్, పైడి హరనాథరావు, టెక్కం రాంగోపాల్, గుత్తు చిన్నారావు, తర్లాడ అప్పలనాయుడు, పందిరి అప్పారావు, కె.ఆర్.నాయుడు, మహిబుల్లా ఖాన్ పాల్గొన్నారు.



## తలసేమియా పిల్లల కోసం మహాయజ్ఞం ఆనందదాయకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తలసేమియా పిల్లల కోసం మృత్యుంజయ మహాయజ్ఞం ఆనందదాయకమని టీడీపీ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ తొత్తడి మణికంఠ, యునైటెడ్ ఎన్జీవోస్ ఆధ్వర్యంలో తలసేమియా పిల్లలకోసం గురువారం అయ్యప్పస్వామి మహాయజ్ఞ కార్యక్రమాన్ని, ఫాజుల్ బాగ్‌పేట, దేవాంగులవీధి, శ్రీకాకుళంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వాతి శంకర్ మాట్లాడుతూ తలసేమియా పిల్లల కోసం హోమం చెయ్యటం గొప్ప విషయమని, మణికంఠ కోసం ఎప్పుడూ వినడమే గాని, నేడు ప్రత్యక్షంగా చూస్తున్నానన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ వరించిన విషయం తెలిసిందేనని, సేవలు ఇంకా కొనసాగాలన్నారు. అనంతరం టీడీపీ యూత్ జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు మాట్లాడుతూ తలసేమియా పిల్లల కోసం ఎప్పుడూ తపిస్తుంటారని, వాటి ఫలితమే శ్రీకాకుళానికి ఒక తలసేమియా వైద్యపరీక్షా కేంద్రం తేవటంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవ చూపిస్తున్నారన్నారు. అనంతరం గొండు స్వాతి శంకర్, మెండ దాసునాయుడు, యునైటెడ్ ఎన్జీవోస్‌కు జ్ఞాపికలను అందించారు. తలసేమియా పిల్లలకు స్కూల్ కిట్లతో పాటు, న్యూట్రిషన్ కిట్లను అందించారు.

### ప్రకృతి వ్యవసాయం జిల్లాలో
# మరింత విస్తరింప చేయాలి

**- ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజలకి అవగాహన అవసరం**

**- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రకృతి వ్యవసాయం జిల్లాలో మరింత విస్తరింపజేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలో పంటల సాగు, ఉత్పత్తుల విస్తీర్ణం, ఆదాయం మరింత పెరగాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలకు సర్టిఫికేషన్ అవసరమన్నారు. జిల్లా కలెక్టర్ సంబంధిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఉత్పత్తుల ప్యాకింగ్‌పై ఆరా తీశారు. ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు ప్యాకింగ్ విధానంపై వివరించారు. ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజలకి అవగాహన అవసరమని, ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపేలా అవగాహన కల్పించాలన్నారు. తద్వారా రైతులకు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. బెజ్జిపురం యూత్‌క్లబ్ వ్యవస్థాపకులు ఎం. ప్రసాదరావు, సి.ఎ.వి.ఎస్ స్వచ్ఛంద సంస్థ పగడాల భూదేవి, స్వేప్ స్వచ్ఛంద సంస్థ రమణమూర్తి, ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు, ఇంద్రసేనా రెడ్డి తదితరులు పలు సూచనలు ఇస్తూ, జిల్లా కేంద్రంలో హబ్ ఏర్పాటు చేయాలని తద్వారా మార్కెటింగ్‌కి మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. అలాగే ఉత్పత్తుల మొత్తానికి ఒకటే ప్యాకింగ్ చేపట్టి మార్కెటింగ్ చేయాలని అలాగే మిలిట్స్ వాడకానికి సంబందించిన రెస్పిపై అవగాహనా కల్పించిన రోజు వాడకం దారులు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులకు కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకానికి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా అమ్మకానికి స్థలాన్ని కేటాయించాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోరగా జిల్లా కలెక్టర్ ఏర్పాటుకు సంబంధించి మునిసిపల్ కమిషనర్ తో మాట్లాడి ఏర్పాటు చేయాలని, అలాగే మెప్మా మార్ట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులపై ఒక రెక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. అలాగే ప్రతీ సూపర్‌మార్కెట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులపై ఒక రెక్ ఏర్పాటు చేయాలని సూపర్‌మార్కెట్ ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ్ స్వామి, మార్కెటింగ్ సహాయ సంచాలకులు బి రవికుమార్, జిల్లాలో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు, మార్కెటింగ్ చేస్తున్న వ్యాపారులు పాల్గొన్నారు.



## హోం కంపోస్టింగ్‌పై అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో ఇంటి నుంచి వెలువడే తడి చెత్తతో ఇంట్లోనే ఎరువు తయారు చేసుకునే విధంగా అవగాహన కల్పించారు. నగరంలోని సాయికృప అపార్ట్మెంట్ సభ్యులతో కమిషనర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి హోం కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు హోం కంపోస్టింగ్ బిన్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌ఛార్జి ఇప్పిలి తిరుమలరావు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్, వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ మేస్త్రీలు పాల్గొన్నారు.




# కళింగ చరిత్రపై అధ్యయనం


**- పరిశోధన పేరుతో కొందరు వక్రీకరించారు**

**- దర్శక నిర్మాత, రచయిత గూన అప్పారావు**




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహా మేఘవాహన వంశంగా గుర్తించబడిన కళింగ చరిత్ర మహావైభవాన్ని ఉత్తరాంధ్ర ప్రజలకు తెలియజేసేందుకు ఆధ్యయనం చేస్తున్నట్టు దర్శక, నిర్మాత, కళింగ ఆర్ట్ క్రియేషన్స్ వ్యవస్థాపకులు, రచయత గూన అప్పారావు తెలిపారు. కళింగ యుద్ధం, కళింగ రాజులు, చరిత్రపై ఆధ్యయనం చేసేందుకు ఒడిశా ఉదయగిరిలోని హస్తీ గుంఫా గృహాలను సందర్శించినట్లు గురువారం తెలిపారు. ప్రస్తుతం వారంరోజులుగా భువనేశ్వర్‌లోని స్టేట్ లైబ్రేరిలో ఉన్న చరిత్రకారుల రాసిన పుస్తకాలను సంగ్రహిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ యుద్ధాల చరిత్రలో కళింగ యుద్ధానికి ఒక ప్రముఖ స్థానం ఉందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన కళింగ యుద్ధం, చరిత్ర పై భారతీయ చరిత్రకారులు దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. కళింగ యుద్ధానికి పూర్వం క్రీ.పూ.10వేల సంవత్సరాల నుంచి కళింగ సామ్రాజ్యంలో జరిగిన ఇతివృత్తాలను ఒక పుస్తకరూపంలో తీసుకురావాలని ఆలోచనతో ఒడిశాలో పర్యటిస్తున్నట్టు తెలిపారు. హస్తీ గుంఫా గృహాల్లో ఖరవేలుడు కాలం నాటి శాసనాలు పాళీ భాషలో ఉన్నాయని వాటిని తెలుగులో అనువదించే ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిపారు. కళింగుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, శాస్త్ర సాంకేతిక, మత విశ్వాసాలు ఏమిటి అనే విషయంపై సమగ్ర పరిశోధన జరగలేదన్నారు. కళింగులు అంటే కళింగ యుద్ధం, ఖారావేలుడు మినహా ఏమి తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటి వరకు కళింగ చరిత్రను పరిశోధన చేసే వారతా వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాచీన కళింగ చరిత్ర పరిశోధన చేసి కళింగ చరిత్రకు రూపం తీసుకురావాలని సంకల్పించినట్టు తెలిపారు. క్రీ. పూ.10వేల సంవత్సరాల నుంచి క్రీ.పూ. 500 సంవత్సరాల వరకు (కళింగ యుద్ధంకు పూర్వం) కళింగ చరిత్ర ఆధారాలతో సహా నిరూపించడానికి ఎంతో శ్రమతో ఆధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. కొన్నిరోజులుగా భువనేశ్వర్‌లోనే ఉంటూ కళింగ యుద్ధం జరిగిన ప్రాంతం, తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించినట్టు తెలిపారు. కళింగ చరిత్రలో జరిగిన వాస్తవాలు బయటకు తీసుకురావడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. నాలుగు భాగాలుగా దీన్ని విభజించి పుస్తక రూపంలో తీసుకువస్తున్నట్టు తెలిపారు.



## ఘనంగా సహకార వారోత్సవాలు

**- డీసీసీబీలో పతాకాన్ని ఆవిష్కరించిన జేసీ ఫర్మాన్**

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

71వ అఖిల భారత సహకార వారోత్సవ కార్యక్రమాలను గురువారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ప్రారంభించి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీసీబీ సీఈవో డి.వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. సహకార వ్యవస్థ ద్వారా చిన్న సన్నకారు రైతులకు, బీపీఎల్ లబ్ధిదారులకు సహకార సంఘాలు సేవలందించడంపై అభినందించారు. సంఘాలు పూర్తిగా కంప్యూటరైజేషన్ జరిగి పీఏసీఎస్‌లను, గ్రామస్థాయిలో ఉన్న సంఘాలను నాబార్డుతో అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల సహకార సంఘాల కార్యకలాపాలు పారదర్శకంగా జరుగుతాయన్నారు. మోడల్ బైలాస్ పీఏసీఎస్ ఆదాయాన్ని పెంచుతాయన్నారు. అందుకోసం పీఏసీఎస్‌ల్లో వివిధ రకాల సేవలను విస్తరించడంలో భాగంగా సాధారణ సేవా కేంద్రాలు ద్వారా 300కంటే ఎక్కువ ఈ సేవలను అందించనున్నాయన్నారు. జిల్లా సహకార అధికారి బి.నగేష్ "వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర" అనే ప్రధాన అంశంపై మాట్లాడారు. సీఈవో డి.వరప్రసాద్ మాట్లాడుతూ సహకార వ్యవస్థకు 2021లో కేంద్రం ప్రత్యేక సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి నూతన కార్యక్రమాల ద్వారా సహకార ఉద్యమాన్ని బలోపేతం చేశారన్నారు. కేంద్ర సహకార శాఖా మంత్రి అమిత్‌షా నేతృత్వంలో సహకార వ్యవస్థ అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్ర సహకార శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పూర్తి సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. మొదటిరోజు వారోత్సవ కార్యక్రమంలో నాబార్డు డిడియం కె.రమేష్ క్రిష్ణ, బ్యాంకు జీఎం ఎస్ఎఎస్ జగదీష్, శ్రీకాకుళం డివిజినల్ సహకార అధికారి బి.మురళీక్రిష్ణ, టెక్కలి డివిజినల్ సహకార అధికారి కె.మురళీక్రిష్ణమూర్తి, బ్యాంకు డిజియంలు, ఎజియంలు, చీఫ్ మేనేజర్లు, మేనేజర్లు, బ్యాంకు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రంథాలయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

(సత్యంన్యూస్, లావేరు)

గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని లావేరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పసుపుల జగన్నాథం అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ఆయన తొలుత పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలని, విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 20 వరకు గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తొలుత గ్రంథాలయ నివేదిక చదివి వినిపించారు. విద్యార్థులతో గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు నాగరాజు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 'కాకినాడ'లో ఘనంగా నెహ్రూ జయంతి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


నగరంలోని ఎల్ఐసి కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ గురువారం ప్రారంభించారు. ఎస్ఆర్ రంగనాథన్, నెహ్రూ చిత్రపటాలకు పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్, పుస్తక ప్రదర్శనవంటి పోటీలను నిర్వహించారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజు బహుమతులను అందజేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే దేశానికి నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పీవో ఎల్.మోహనరావు, పైడిరాజు, లైబ్రేరియన్ పి.వై.కమల్‌కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## నీలమణి ఆలయ అభివృద్ధికి కోటి మంజూరు చేయండి

**- దేవదాయ శాఖా మంత్రిని కోరిన ఎంజీఆర్**

(సత్యంన్యూస్, పాతపట్నం)

పాతపట్నం గ్రామదేవత, ఉత్కళాంధ్రుల ఇలవేల్పు శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి కోటి రూపాయలు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈమేరకు సచివాలయంలో కలసి వినతిపత్రం అందించారు. ప్రతీ ఏడాది జరిగే వార్షికోత్సవాలను, 7 సంవత్సరాలకు ఒకసారి జరిపే అమ్మవారి పెద్దపండగలను ప్రభుత్వ అధికార లాంచనాలతో జరపాలని మంత్రిని అభ్యర్థించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం అంబేద్కర్ జంక్షన్ వద్ద ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్‌మీటర్లు పెడుతున్నారని, నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుంచే వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లపై ఎక్కడికక్కడ ప్రజలు సమైక్యమై ప్రతిఘటించాలని, ప్రజా ప్రతినిధులను నిలదీయాలని, రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్‌మీటర్లు ట్రూఅప్ ఛార్జీలకు వ్యతిరేకంగా వామపక్షాల పిలుపుపై జరిగే ఆందోళనల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.మోహనరావు, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, సీహెచ్ అమ్మన్నాయుడు, పోలాకి ప్రసాదరావు, కొత్తకోట అప్పారావు, ఆర్.ప్రకాశరావు, అల్లు సత్యనారాయణ, వెలమల రమణ, పొందూరు చంద్రావు, ఎల్.ఉమామహేశ్వరరావు, జి.ఈశ్వరమ్మ, ఎ.లక్ష్మీ, పి.గోపి తదితరులు పాల్గొన్నారు.




## పీఎంపీ అసోసియేషన్ వైద్యశిబిరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూకాలనీ శ్రీ సత్య సాయి మందిరంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. సుమారు 150 మందికి షుగరు, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేశారు. సంఘ సభ్యులకు సత్యసాయి మందిరం కన్వీనర్ జయరామ్ స్వామివారి ప్రత్యేక హారతి కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహించినందుకు పీఎంపీ సంఘ సభ్యులకు జయరామ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వందాన శిమ్మన్న, జిల్లా కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రెటరీ చిన్నాల రాము, ఈసీ మెంబర్ కింజరాపు రాజారావు, సీనియర్ మెంబర్స్ మంగరాజు లవుడు, మడ్డి అప్పలరాజు, డోల వాసు, ఆర్.నవీన్‌రాజు, ఆర్.తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

